క్లుప్తంగా

ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించాలి



సూచనలు ఇస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను మళ్లీ ఒకసారి పరిశీలించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండలంలో 13,629 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినప్పటికీ దరఖాస్తు ఫారాల్లో సరైన సమాచారం లేకుంటే కార్యదర్శుల నుంచి సమాచారం సేకరించి సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

దాడిపై బీజేపీ నాయకుల ఫిర్యాదు



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కొండ్రికర్లలో బీజేపీకి మెజార్టీ ఎక్కువచ్చినందుకే గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఆకుల శ్రీనివాస్‌పై బీఆర్‌ఎస్ నాయకులు దాడికి పాల్పడ్డారని ఆ పార్టీ నేతలు శుక్రవారం మెట్‌పల్లి డీఎస్పీ రవీంద్రరెడ్డి ఫిర్యాదు చేశారు. బీజేపీ కార్యకర్తలపై భౌతికదాడులకు పాల్పడుతున్నారని దాడి చేసిన గడ్డం రాజారెడ్డి, మెండె రమేశ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు మరలా పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు రాజ్‌పాల్ రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, జనార్దన్, శ్రీధర్, రాజేశ్వర్, గంగాధర్, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుల్తానా

జగిత్యాల: దేశభవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుల్తానా అన్నారు. శుక్రవారం జాతీయ యువజన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యధిక సంఖ్యలో యువత ఉందని, ఈ యువత మానవ వనరులుగా ప్రపంచానికి ఉపయోగపడి భవిష్యత్‌ను నిర్దేశించే స్థితిలో ఉందన్నారు. యువత దేశం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్మయి, శ్రీనివాస్, శంకరయ్య, మానస, మాధవి, సునీత పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



జగిత్యాలరూరల్: మండలంలోని గుల్లపేటలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని గ్రామానికి చెందిన సామాజిక సేవకులు సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండ జ్యోతివాణి పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. సాంప్రదాయ బద్ధంగా విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. హెచ్‌ఎం సిరిమల్ల రాజేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగకు తయారు చేసే వివిధ పదార్థాలు ప్రదర్శించారు. విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రాయికల్: పట్టణంలోని శ్రీనిధి కళాశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

యువత వివేకానందున్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

జగిత్యాలటౌన్/కోరుట్లటౌన్/మెట్‌పల్లి/రాయికల్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/కథలాపూర్/కోరుట్ల/మల్యాల/గొల్లపల్లి/ధర్మపురి: యువత వివేకానందున్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రభుత్వామోదిత పాఠశాలల యాజమాన్యం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానందుని విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా వివేకానందుని జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, మండల కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



మెట్‌పల్లిలో వివేకానందుడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్



సిరికొండలో నివాళి అర్పిస్తున్న నాయకులు



ధర్మపురిలో..



మల్యాలలో నాయకుల నివాళి



మల్లాపూర్ మండలం సాతారంలో..



భూపతిపూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



జగిత్యాలలో భోగ శ్రావణి, నాయకుల నివాళి



గొల్లపల్లిలో వివేకానందుడి జయంతి వేడుకలు



కోరుట్లలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో..

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు

మల్యాల: తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంత ప్రజల సమస్యలను ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాన్ని సద్వినియోగం చేసుకుని, అధికారులను నిలదీసి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన ఎంపీటీసీలకు తమ వ్యక్తిగత ప్రయోజనాలే ప్రధాన ఎజెండాగా మారాయి. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా, కోర్టు ఉత్తర్వులతో వాయిదా పడిన నేపథ్యంలో శనివారం ఎంపీపీ మిట్టపల్లి విమల అధ్యక్షతన నిర్వహించిన సమావేశం ఉత్కంఠంగా సాగింది. అవిశ్వాస తీర్మానం పెట్టిన ఎంపీటీసీలు సైతం సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో ఒకరిద్దరు మినహా సభ్యులు ఎవరూ నోరు మెదపలేదు. మండలంలోని ఒక్కో ప్రభుత్వ విభాగం అధికారి తమ ప్రగతి నివేదికలు చదవడంతోనే సమావేశం పూర్తయింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటి తర్వాత అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చిన ఎంపీటీసీలు ఒకరి తర్వాత ఒకరు ఎంపీటీసీలు రవళి, అనిత, వనిత, సఫియా, సంజన బయటకు వెళ్లిపోయారు. సమావేశంలో పోతారం ఎంపీటీసీ కొల్లూరి గంగాధర్ మినహా ఎవరూ నోరు మెదపకపోవడంతో సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. అత్యవసరంగా పశువులకు చికిత్స అందించేందుకు అంబులెన్స్‌కు ఫోన్ చేసినా పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించడం లేదని, గ్రామాల్లో అంబులెన్స్ నంబర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని పోతారం ఎంపీటీసీ కొల్లూరి గంగాధర్ అన్నారు. గ్రామాల్లో కుక్కల భయంతో పిల్లలు, పశువులపై దాడులు చేస్తున్నాయని, కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కలను చంపే అధికారం ఎవరికీ లేదని ఎంపీడీఓ వేంకటేశం సమాధానం ఇవ్వగా, కుక్కలు మనుషుల ప్రాణాలు తీసేదాకా చర్యలు చేపట్టరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ఊరికి బస్సులు వేయాలని పోతారం ఎంపీటీసీ కొల్లూరి గంగాధర్, ముత్యంపేట ఎంపీటీసీ సామల రేణుక, బల్వంతాపూర్ ఎంపీటీసీ సంగని రవి సమావేశానికి హాజరైన ఆర్టీసీ ప్రతినిధిని కోరారు. వరదకాలువ మట్టిని యథేచ్ఛగా తరలించుకుపోతున్నారని నీటి పారుదల శాఖ అధికారులను మల్యాల సొసైటీ చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ఎంపీడీవో వేంకటేశం, తహసీల్దార్ మునీందర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'గుడ్ మార్నింగ్ కోరుట్ల'

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



వేంపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: ప్రజాసమస్యల పరిష్కారం కోసమే 'గుడ్ మార్నింగ్ కోరుట్ల' నిర్వహిస్తున్నట్లు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండలం వేంపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వీధుల్లో తిరిగిన ఆయన పేరుకుపోయిన పలు సమస్యల గురించి తెలుసుకున్నారు. ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం పూర్తిచేయాలని, యూరియ కొరత తీర్చాలని, విద్యుత్ లైన్ సమస్య, ఇతర సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండడంతో కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు, జీపీ కార్యదర్శి ప్రేమలత, ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్: కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కప్పారావుపేటలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి వెల్గటూర్ మండల స్థాయి కార్యకర్తల సమన్వయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, గెలిస్తే పొంగిపోవడం, ఓడితే కుంగిపోవడం సరైందికాదని, ఈ ఓటమితో ఎవరూ కుంగిపోవద్దని కార్యకర్తలకు మనోధైర్యం నింపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాక బీఆర్‌ఎస్ కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులపై పోరాడేందుకు కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చినా తోడుంటానని ధైర్యం నింపారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, ఎంపీటీసీ గాజుల మల్లేశం, జూపాక కుమార్, పాడేటి రవి, బిదారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి పరామర్శ

ఎండపల్లి ఎంపీటీసీ ఎండీ బషీర్ తల్లి వొజ్రబీ ఈ నెల 9వ తేదీన అనారోగ్యంతో మరణించగా శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బషీర్‌ను వారి నివాసంలో కలిసి పరామర్శించారు.

వైభవంగా.. కుడారై ఉత్సవం

కోరుట్లటౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కుడారై ఉత్సవం ప్రధానార్చకులు బీర్నంది నరసింహ చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తిరుప్పావై సేవ, శ్రీ గోదాదేవి పాశురం అభిషేక అర్చనలు, స్వామివారి ఉత్సవ విగ్రహాల ముందు ఇత్తడి గంగాళంలో నైవేద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.విక్రమ్, ఆండాళ్ గోష్ఠి బృందం పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కుడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, నాగిరెడ్డి, చిన్న లింబాద్రిగౌడ్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఓటరు లిస్ట్ సవరణపై కలెక్టర్‌కు లేఖ

రాయికల్: పట్టణంలోని ఓటరు లిస్ట్ సవరణ చేయాలని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు లేఖ రాశారు. తెలంగాణ శాసనసభ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం వారు విడుదల చేసిన ఓటరు జాబితాలో కొన్ని ఓట్లు వార్డుల వారిగా నమోదు కాలేదని, చాలా వరకు ఓట్లు పాత జాబితాలో పోల్చుకుంటే కొత్త జాబితాలో వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదయ్యాయని, దీని వల్ల పోలింగ్ సమయంలో ఓటర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని 12 వార్డుల్లో ఓటరు జాబితా ఇంటి నంబర్ల వారిగా సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మల్యాల: మండలంలోని మద్దుట్ల 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మద్దుట్ల, గొర్రెగుండం, గొల్లపల్లె, రామన్నపేట, నూకపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రామన్నపేట సెక్షన్ ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సారంగాపూర్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (టీజీఎల్‌ఏ–711) క్యాలెండర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వి. రామకృష్ణ బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు రాష్ట్ర, జిల్లా కార్యవర్గంలో సభ్యత్వం లభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి: సంక్రాంతి సెలవుల్లో దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మాట్లాడారు. సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విలువైన వస్తువులను, నగదును ఇళ్లల్లో ఉంచవద్దన్నారు. ఊళ్లకు వెళ్లే దానిపై పోలీసులకు సమాచారమిస్తే పర్యవేక్షిస్తారన్నారు. ప్రయాణాల సమయంలో కూడా చైన్‌స్నాచర్ల దృష్టిలో పడకుండా, ప్రమాదాలకు గురి కాకుండా అవసరమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాల నియంత్రణకు గట్టి చర్యలు చేపట్టామని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

ఫంక్షన్ హాల్ సీజ్

కోరుట్ల: పట్టణ శివారులోని ముక్కాస్ కన్వెన్షన్ హాల్‌ను మున్సిపల్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. పట్టణానికి చెందిన ముక్క చిన్న ధర్మరాజు–శైలజ పేరు మీద నిర్మాణం చేపట్టిన ఈ కన్వెన్షన్ హాల్ పర్మిషన్ డబ్బులు మూడు విడతలుగా చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. నిర్మాణం పూర్తయి రెండు విడతల పర్మిషన్ ఫీజు చెల్లించగా మూడో విడత డబ్బులు పెనాల్టీ తో చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించటం లేదు. దీంతో ఎన్నోసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ బకాయిలు చెల్లించక పోవటంతో సీజ్ చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీ

రాయికల్: గాలిపటాలు ఎగురవేయడం కోసం వినియోగించే నైలాన్, సింథటిక్ దారాలు, చైనామాంజ వంటి దారాలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అటవీ క్షేత్ర అధికారి టి.భూమేశ్ అన్నారు. శుక్రవారం రాయికల్‌లో పలు దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి చంద్రమౌళి, ఎఫ్‌ఎస్‌వో మల్లన్న, బీట్ అధికారులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం

కొండగట్టు: యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని వివేకానందుని అడుగుజాడల్లో నడవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో శుక్రవారం వివేకానందుని జయంతి వేడుకల్లో అల్పోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. రాష్ట్ర భవిష్యత్తు యువకుల చేతిలోనే ఉందని, వారు తలచుకుంటే ఏదైనా సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏలేటి మమత, తహసీల్దార్ రవికాంత్, ఎంపీటీసీ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాథుల కల్యాణం



మెట్‌పల్లిలో స్వామివారి కల్యాణంలో భక్తులు

మెట్‌పల్లి: పట్టణంలోని కోదండ రామాలయంలో శుక్రవారం గోదారంగనాథుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి ఆ తర్వాత వేదమంత్రోచ్ఛరణాల మధ్య కల్యాణం జరిపారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో గోదాదేవి రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేకపూజలు,అభిషేకాలు,కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు హాజరై ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో శుక్రవారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవీ రంగనాయకుల కల్యాణాన్ని అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నం నవ్యశ్రీ, ఎంపీటీసీ దొెట్టి శాంత, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీ అష్టలక్ష్మీ ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల రామస్వామి గౌడ్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మధుసూదనాచారి, నర్సింహచారి, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అలిశెట్టికి ఘన నివాళి

గొల్లపల్లి: మండల కేంద్రంలోని పద్మశాలీ సేవా సంఘ భవనంలో అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు చౌటపెల్లి తిరుపతి మాట్లాడుతూ అలిశెట్టి ప్రభాకర్ అభాగ్యుల గొంతుకగా తన కవిత్వాన్ని మలిచిన ప్రజాకవి అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అందె లక్ష్మణ్, కోశాధికారి అంకం లింబాద్రి, ఉపాధ్యక్షులు ఎనగందుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రాజ్‌కిరణ్, మనోజ్ శుక్రవారం కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు జంగిటి రాజేందర్ పాల్గొన్నారు.

గడపగడపకూ శ్రీరాముని అక్షింతలు

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆనంద్ నగర్‌లో అయోధ్య శ్రీరాముని అక్షింతలను శుక్రవారం గడపగడపకూ పంపిణీ చేపట్టారు. మండలంలోని జోగిన్‌పెల్లిలో శుక్రవారం అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ చేపట్టారు. వెల్గటూర్ మండలం కప్పారావుపేటలో అయోధ్య రాముని అక్షింతలను ప్రతీ ఇంటికీ పంపిణీ చేశారు.

స్వార్థ రాజకీయాల కోసమే అవిశ్వాసం

వెల్గటూర్: ఎంపీపీపై అవిశ్వాసం పెట్టింది కేవలం వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప దీని వల్ల ప్రజలకు ఒరిగిందేంలేదని మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పాడేటి సతీశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. తనను చీటర్ అని, ప్రలోభాలకు అమ్ముడు పోయాడని అంబరిపేట ఎంపీటీసీ జాడి సుజాత మాట్లాడిన మాటలను ఖండించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాంచందర్, కుమార్, సర్పంచ్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు–బైక్ ఢీ ఒకరికి గాయాలు

మల్యాల: మండలంలోని రాజారంలో ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం సికింద్రాబాద్ వెళ్తున్న జగిత్యాల డిపోకు చెందిన బస్సు రాజారం బస్టాప్ వద్ద బైక్‌ను ఢీకొనగా, ప్రమాదంలో రాజారం గ్రామానికి చెందిన గుర్రం లింగం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని జగిత్యాల ప్రధాన ఆస్పత్రికి తరలించారు.